ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పిఠాపురంలో కన్నులపండువగా
కుక్కుటేశుని కల్యాణం - 7లో

సామర్లకోటలో వైభవంగా
భీమేశ్వరుని దివ్యకల్యాణోత్సవం - 7లో

గాలికొదిలేశారు



తాళ్లరేవు మండలం ఇంజరం కెనాల్‌పై శిథిలమైన వంతెన పేరుకుపోయిన చెత్త



అక్కడున్న వంతెన శిథిలావస్థకు చేరింది. దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాల్సింది పోయి తాత్కాలిక రహదారి నిర్మాణం చేశారు. దానివల్ల సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. గుర్రపుడెక్క వ్యర్థాలు అడ్డుపడి నీటి సరఫరా జరగక పొలాలకు నీరు చేరని పరిస్థితి ఉంది. దీంతో పొలాలు ఎండిపోయి రైతులు నానా తంటాలు పడుతున్నారు.

- శిథిలావస్థకు చేరిన ఇంజరం వంతెన
- తాత్కాలిక రహదారి నిర్మాణంతో దానిపైనే రాకపోకలు
- ఆ రహదారి కింద పైపులతో గుర్రపుడెక్క వ్యర్థాలు పేరుకుపోయి సాగునీటి సరఫరాకు తరచూ ఆటంకాలు
- ఐదేళ్లుగా రైతుల ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికార యంత్రాంగం

తాళ్లరేవు, మార్చి 6: తాళ్లరేవు మండలంలో ఇంజరం వంతెన నిర్మాణం జరగకపోవడంతో సాగునీటి సమస్య ఏర్పడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపిస్తున్నారు. ఇంజరం కెనాల్‌పై బ్రిటీష్‌కాలంనాటి వంతెన శిథిలమై కుంగిపోవడంతో అధికారులు వంతెనపై రాకపోకలను నిలిపివేసి తాత్కాలికంగా కెనాల్‌పై పైపులు వేసి సిమెంటు రోడ్డు నిర్మించారు. పైనుంచి వచ్చే చెత్తాచెదారం, గుర్రపుడెక్క పైపులకు తగులుకుని సాగునీరు కిందకు సక్రమంగా పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు కదలని ప్రతిపాదనలు

2019, ఆగస్టులో ఇంజరం వంతెన నిర్మాణం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ వంతెన నిర్మాణానికిగాను రూ.2.80కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా ఫైలు ముందుకు కదలలేదు. దీంతో ఆ నిర్మాణం ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. ఐదేళ్లుగా రైతులు కోరింగ కెనాల్‌పై సాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఆఖరికి రైతులు సాగునీటి కోసం పురుగుమందుల డబ్బాలు పట్టుకుని ఆత్మహత్యలు చేసుకుంటామని ధర్నాలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై రైతులు విమర్శిస్తున్నారు.

పేరుకుపోతున్న చెత్త

వంతెన కింద పైపుల వద్ద ప్రతిరోజూ చెత్త పేరుకుపోవడంతో ఇరిగేషన్ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టకుంటే పైపులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించేస్తామని రైతులు హెచ్చరికలు చేస్తున్నారు. సాగునీరు వంతుల విధానం కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో పొలాల నీటి ఎద్దడిని రైతులు తట్టుకోలేకపోతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి ఇంజరం వంతెననిర్మాణం చేపట్టి తాత్కాలికంగా కెనాల్‌పై వేసిన పైపులను తొలగిస్తేగానీ పూర్తిస్థాయిలో శివారుభూములకు సాగునీరు అందదని రైతులు చెప్తున్నారు. లేకుంటే తామంతా ఏకమై తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరిస్తున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి



ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపడితేగానీ సాగునీటి సమస్య పరిష్కారం కాదు. ఐదేళ్ల మోసకారి మాటలు చెబుతూ రైతులను ప్రభుత్వం మోసం చేసింది. సాగునీటి సమస్య పరిష్కారం కావాలంటే వంతెన నిర్మాణం చేపట్టాల్సిందే.

-పోతుల చక్రశేషారావు, రైతు, ఇంజరం

సాగునీరు అందివ్వాలి



ప్రభుత్వం శివారు భూములకు సాగునీరు అందివ్వాలి.అధికారులకు ముందుచూపు లేదు. సమస్య వచ్చినప్పుడే సాగునీటి కోసం మాట్లాడుతున్నారు. అధికారులు పైనుంచి సాగునీరుసామర్థ్యాన్ని పెంచి కోరింగ కెనాల్‌కు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

-రెడ్డి వీర్రాజు, కౌలురైతు, ఇంజరం

ఘనంగా మహాశివరాత్రి
ఉత్సవ పూజలు ప్రారంభం

- పాదగయలో వైభవంగా అంకురార్పణ



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

పిఠాపురం, మార్చి 6: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో అంకురార్పణ, ధ్వజారోహణం వైభవంగా జరిగాయి. పాదగయలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్స వాల్లో భాగంగా తొలిరోజు బుధవారం స్వామి, అమ్మవార్లకు పంచామృతస్నానం నిర్వహించి, ఉత్సవాలకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అంకుర్పారణ జరిపారు. ధ్వజారోహణ నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీ దేవికి లక్ష కుంకుమార్చన జరిగాయి. గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం కైతేపల్లి శ్యామ్‌సుందర్‌శర్మ దంపతులు స్వామిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేశారు. అనంతరం రామకృష్ణ వాసవీ కన్యకా పరమేశ్వరీ కళ్యాణమండపంవద్ద ఆర్యవైశ్యభక్త బృందం సభ్యులు ఎదురు సన్నాహాలు జరిగాయి. కార్యక్రమాల్లో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆగంటి ప్రభాకరరావు దంపతులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు



విశేష పూజల్లో భీమేశ్వరస్వామి

సామర్లకోట, మార్చి 6: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామర్లకోట భీమేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య విఘ్నేశ్వరపూజ, అంకురారోపణ దీక్షాధారణ పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల దేవతామూర్తులను ఇత్తడి నందివాహనంపై అలంకరించి గ్రామోత్సవం, బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించారు.

నేటి పూజలు

భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు పురష్కరించుకుని గురువారం ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో ఉదయం స్వామి మూలవిరాట్‌వద్ద అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమార్చన పూజలు, సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. సాయంత్రం అమృతవర్షిణి భక్త బృందం వారి ఆధ్వర్యంలో గాత్రకచేరి ఏఎల్‌వీఎస్. ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పండి

- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, చిత్రంలో యనమల

కోటనందూరు, మార్చి 6: అవినీతి సొమ్ముతో జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి ఎంతకైనా దిగజారుతుందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. కోటనందూరులో టీడీపీ మండల అధ్యక్షుడిగా డి.రాజుబాబు అధ్యక్షతన సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలతో సంపాదించిన డబ్బుతో ఓట్లు కొని మళ్లీ అధికారంలోకి రావడానికి సిద్ధం సభల ద్వారా తెలియజేస్తున్నారని, జగన్ ప్రభుత్వానికి ఓటతో బుద్ధి చెప్పాలని అన్నారు. అనంతరం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ లిక్కర్, మైనింగ్ డబ్బుతో రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయన ఎక్కడ సమావేశాలకు వెళ్లినా పరదాలు లేకుండా వెళ్లే సత్తా ఉందా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని, ప్రత్యేకహోదా, సీపీఎస్ రద్దు అని చెప్పిన వ్యక్తి నేడు వీటిపై మాట్లాడకుండా తప్పించుకొని తిరుగుతున్నారన్నారు. జగన్ మూడు నెలల్లో జైలుకెళ్లడం ఖాయమన్నారు. ఐదేళ్ల కాలం అంతా అయిపోయిన తర్వాత ఇప్పుడు అభివృద్ధి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో పేదవాళ్ల బతుకులు బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యనమల దివ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమలకృష్ణుడు, సుర్ల లోవరాజు, వెలగా కృష్ణారావు, వెలగా గందర రంగనాయుకులు, జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, డి.చిరంజీవిరాజు, గుడివాడ అప్పలనాయుడు మాస్టారు, బంటుపల్లి వెంకటేశ్వరరావు, పెదపాత్రుని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రిష్ణేశ్వర స్వామి కల్యాణం

- మహారుద్రాభిషేకంలో పాల్గొన్న ప్రముఖులు
- నేటి ఉదయం 8.30గంటలకు మహా పూర్ణాహుతి
- 11గంటల తర్వాత కోటి పార్థివ లింగాలు నిమజ్జనం



పూజలు నిర్వహిస్తున్న జ్యోతుల నెహ్రూ దంపతులు

జగ్గంపేట, మార్చి 6: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటిపార్థివలింగ మహారుద్రాభిషేకంలో భాగంగా బుధవారం పదోరోజు విఘ్నేశ్వరపూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహావ్యాసం, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, దేవతల హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ, మణి, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, సునీత దంపతులు పీటలపై కూర్చొని గ్రిష్ణేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో పాల్గొన్న శ్రీ బ్రహ్మపదం ఆధ్యాత్మిక సేవా సంస్థ పీఠాధిపతులు, బ్రహ్మంగారి ఉపాసకులు, కాలజ్ఞానతత్వ ప్రవచనాకర్త, బ్రహ్మశ్రీ డాక్టర్ బ్రహ్మ యోగానంద కృష్ణమాచార్యులు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సృజన కృష్ణరంగారావు మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు తమ స్వహస్తాలతో కోటి పార్థివ లింగాలకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్య స్వామి మాట్లాడుతూ 400ఏళ్ల క్రితమే కాలజ్ఞానాన్ని రచించి అనేక సంస్కరణ తీసుకొచ్చిన వ్యక్తి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని, జంతుబలి, బాల్యవివాహాలు, మూఢ నమ్మకాలను వ్యతిరేకించిన గురువులు బ్రహ్మంగారు కాలజ్ఞానంలో ఉందని చెప్పుకుంటున్నామంటే ఆయన రచనలే కారణమని అన్నారు. జ్యోతుల నెహ్రూ కు ఇంతటి మహత్కార్యానికి తలంపు ఎలా వచ్చిందో తెలియదు కానీ ఆ పరమశివుడు కటాక్షంతో ఈ కోటిపార్థివ లింగా రుద్రాభిషేకం చేస్తున్నారని, ఇందులో పాల్గొన్న ప్రతిఒక్కరికీ కోటి జన్మల పుణ్యం లభిస్తుందని అన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పది రోజులుగా జరుగుతున్న ఈ రుద్రాభిషేకం గురువారం ఉదయం పూర్ణాహుతి కార్యక్రమంతో పూర్తవుతుందని, 11 గంటలకు ఈ కోటి పార్థివలింగాలను ఏలేరులో నిమజ్జనం చేస్తామని తెలిపారు. అనంతరం మహాన్నదానం నిర్వహిస్తున్నామని భక్తులు ఉదయాన్నే ఇర్రిపాక చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు సాయితేజ, జాస్తివసంత్, కన్నబాబు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, అవసరాల బాలసుబ్రహ్మణ్యం, సుంకవిల్లి రాజు, గోరిజాల వెంకన్నదొర పాల్గొన్నారు.

ముద్రగడకు వైసీపీ రాజ్యసభ ఆఫర్!

- నేడు ముద్రగడ నివాసానికి రానున్న ఎంపీ మిథున్‌రెడ్డి

కిర్లంపూడి, మార్చి 6: కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం నివాసానికి వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి గురువారం రానున్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆయన ముద్రగడను కలవనున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రచారానికి ఆయన్ను వాడుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా ఆయనకు రాజ్యసభ సీటు ఇస్తామని ఆశ చూపిస్తున్నట్టు సమాచారం. ముద్రగడకు మొదట్లో వైసీపీ తరఫున పిఠాపురం సీటు ఇచ్చే విషయమై చర్చలు జరిగాయి. కానీ అది సాధ్యపడలేదు. దీంతోపాటు అప్పట్లో మిథున్‌రెడ్డి కొందరు నేతలతో కలిసి ఇంటికి వచ్చి కలుస్తానని చెప్పినా అదీ కుదరలేదు. ముద్రగడ తన కుమారుడికి జగ్గంపేట స్థానం ఇవ్వాలని కూడా ప్రతిపాదించారు. అదీ నెరవేరలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన కినుక వహించారని సమాచారం. ఆ తర్వాత జనసేన నేతలతో ఆయన టచ్‌లోకి వెళ్లారు. పార్టీలోకి వస్తానని తెలియజేయడంతో పవన్‌కల్యాణ్ స్పందించి ఇంటికి వస్తానని ఆయనకు మాట ఇచ్చినట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత పరిణామాల్లో భాగంగా పవన్‌కల్యాణ్ రాలేకపోవడం, పొత్తులో భాగంగా సీట్లు ప్రకటించడంతో ముద్రగడ కోపగించుకున్నారు. తర్వాత ఆయన రూటు మార్చి పవన్‌కల్యాణ్‌పై లేఖాస్త్రం సంధించారు. తనను కలుస్తానని చెప్పి కూడా కలవకపోవడాన్ని లేఖలో తప్పుపట్టారు. టీడీపీతో జనసేన పొత్తు, తీసుకున్న సీట్లపై పవన్‌ను ప్రశ్నించారు. ఈ లేఖాస్త్రం తర్వాత మళ్లీ వైసీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్టు సమాచారం. జనసేన, టీడీపీలోకి ఆయనకు దారులు మూసుకుపోవడంతో ఇప్పుడు పార్టీలోకి తీసుకోవాలని వైసీపీ భావిస్తోంది. ఈ మేరకు రెండురోజుల క్రితం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి సీఎం జగన్‌ను కలిసినట్లు సమాచారం. కాపు ఓట్లలో చీలిక తెచ్చే ప్రణాళికలో భాగంగా ముద్రగడను పార్టీలోకి తీసుకుని కొన్ని జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వాడుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయనకు రాజ్యసభ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. ఈ మేరకు బుధవారం నాడు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేష్ కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభాన్ని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీ మిథున్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. పార్టీలో చేరికకు సంబంధించి సంభాషించినట్లు సమాచారం. దీంతో గురువారం మిథున్‌రెడ్డితోపాటు మంత్రులు, పలువురు నాయకులు ముద్రగడను కలవనున్నారు.

కన్నబాబు ఓడిపోతాడంటున్నారు

- అందుకే కాకినాడ రూరల్ నుంచి స్వతంత్రుడిగా పోటీ చేస్తా
- వైసీపీ నేత, రమ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ పితాని అన్నవరం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 6: ఈఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని రమ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ పితాని అన్నవరం తెలిపారు. ప్రస్తుతం కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న కురసాల కన్నబాబుకు టికెట్ కేటాయిస్తే ఓడిపోతారంటూ తనవద్ద ఉన్న కార్యకర్తలు చెప్తున్నారని వెల్లడించారు. కాకినాడ గాంధీనగర్‌లో ఉన్న రమ్య ఆస్పత్రిలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ అన్నవరం మాట్లాడుతూ తాను జగన్ అభిమానినని, గతంలో ఆయన తనను మండపేటలో పనిచేయమన్నారని, ఆ తర్వాత కాకినాడ రూరల్‌కు వెళ్లమని సూచించారని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే కన్నబాబుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అతడు ఓడిపోతాడని తన దృష్టికి వచ్చిందని, ఈ నేపథ్యంలో తాను పోటీ చేయడం ఖాయమని, కాకినాడ రూరల్ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి: కలెక్టర్

కాకినాడ సిటీ, మార్చి 6: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ రానున్న సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఫ్లయింగ్ స్క్వాడ్స్, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల వ్యయం అకౌంటింగ్, ఎంసీఎంసీ, నోడల్ అధికారుల విధులు, సీ-విజిల్ యాప్ వినియోగం వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా ఎన్నికల విభాగం అధికారులు అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, కేఎస్ఎస్వీ ప్రసాద్‌రాజు వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, పెద్దిరెడ్డి రవికిరణ్, సబ్బారపు అప్పారావు, వల్లూరి రామ్మోహన్, కాళ్లూరి కృష్ణమోహన్, ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

ఈవీఎంలపై పీవో, ఏపీవోలకు 9న శిక్షణ


- ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 6: ఈవీఎంల వినియోగం, పనితీరుపై ఈనెల 9న పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. బుధవారం ఈఅంశంపై నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సెక్టార్ అధికారులకు, మాస్టర్ ట్రైనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే 550మంది పీవో, ఏపీవోలకు ఈ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ జరిగే విధానం, ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఆయన సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఏడుగురు మాస్టర్ ట్రైనర్లతోపాటు, ఏఈఆర్వోలు గుంటూరు శేఖర్, హరిదాసు, సీతాపతిరావు, నాగశాస్త్రులు, జాన్‌బాబు, సెక్టార్ అధికారులు హాజరయ్యారు.

29,730మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత: కలెక్టర్



రైతు లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ, మార్చి 6: గత డిసెంబర్‌లో మిచౌంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో పంటలు నష్టపోయిన 29,730మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.23.05 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించిందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంనుంచి బుధవారం సీఎం జగన్ రాష్ట్రంలో పంటలు నష్టపోయిన 11,59,126మంది వ్యవసాయ, ఉద్యాన రైతులకు రూ.1,294కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా బటన్ నొక్కి విడుదల చేశారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టరేట్‌నుంచి కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య లబ్ధిదార రైతులతో కలిసి పాల్గొన్నారు. సీఎం బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసిన తర్వాత సహాయం చెక్కును రైతు లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో భాగంగా జిల్లాలో 13,006.07 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు నష్టపోయిన 27,980మంది రైతులకు రూ.21కోట్ల98లక్షలు, 533.894 హెక్టార్లలో ఉద్యాన పంటలు నష్టపోయిన 1750మంది రైతులకు రూ.కోటి6లక్షల56వేల532 రాయితీ మొత్తాన్ని పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి నేతల మల్లికార్జునరావు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, లబ్ధిదార రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 22,098మంది విద్యార్థుల హాజరు

కాకినాడ రూరల్, మార్చి 6: జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర గణిత, బోటనీ, సివిక్స్ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 22,981మంది హాజరు కావాల్సిఉండగా 22,098మంది విద్యార్థులు హాజరుకాగా 883మంది పరీక్ష రాయలేదని డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు 1958మంది హాజరు కావాల్సిఉండగా 1828 హాజరు కాగా, 130మంది గైర్హాజరయ్యారన్నారు. ఎస్వో, డీఈసీ 1, 2, 3, ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని, అన్ని కేంద్రాల్లోను పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో తెలిపారు.

9న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 6: తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఈ నెల 9, 10 తేదీల్లో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 9న కాకినాడ రానున్నట్లు వంగూరి ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు తెలిపారు.

నేడు అన్నవరం ఆలయంలో
అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ
వర్చువల్‌గా శంకుస్థాపన - 7లో



శివరాత్రికి సన్నద్ధం

- శైవాలయాల్లో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక ఆకర్షణ
- ప్రత్యేక శోభను సంతరించుకున్న ద్రాక్షారామ, కోటిపల్లి క్షేత్రాలు
- క్యూలైన్ల ఏర్పాటు



కోటి ఫలితాలనిచ్చే క్షేత్రం

కె.గంగవరం, మార్చి 6: కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటిఫలితాలు సిద్ధిస్తాయని ప్రజల విశ్వాసం. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారు, భూదేవి సమేత సిద్ధి జనార్ధనస్వామి, కోటేశ్వరస్వామి, నవగ్రహాలయం ఉన్నాయి. ఆలయం వెలుపల గోశాల ఏర్పాటు చేశారు. భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి పర్వ దినాన సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలివే..

7 నుంచి 9వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 7 గురువారం ఉదయం 5 గంటలకు గౌతమి నది నుంచి తీర్థపు బిందె తీసుకువచ్చి స్వామి వారికి బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 4.30 లకు స్వామి వారి రథోత్సవం, 8న శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మేళ తాళాలతో గోదావరి నదిలో నుంచి తీర్థపు బిందెను తీసుకువచ్చిన అర్చకులు స్వామి వారికి అభిషేకము, బాలభోగము నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు 4 గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. రాత్రి 7 గంటలకు బేడా మండపంపై కోటి దీపార్చన, రాత్రి 9 గంటలకు లక్షపత్రి పూజ నిర్వహిస్తారు.

వాహనాల దారి మళ్లింపు

శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు పామర్రు ఎస్‌ఐ జానీబాషా తెలిపారు. 7 గురువారం రాత్రి 9 గంటల నుంచి రావులపాలెం నుంచి యానాం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కూళ్ల గ్రామం నుంచి పామర్రు, గంగవరం గ్రామాల మీదుగా, యానాం నుంచి రావులపాలెం ఏటిగట్టు మీదుగా వెళ్లే వాహనాలను కోట గ్రామం నుంచి గంగవరం, పామర్రు గ్రామాల వైపుగా మళ్లిస్తున్నారు. అదే విధంగా కాకినాడ నుంచి అమలాపురం వైపుగా గోదావరి పంటుపై ప్రయాణం చేసే వాహనాలను పాతకోట ఏటిగట్టు నుంచి దంగేరు మీదుగా యానాం వైపునకు, అమలాపురం నుంచి కాకినాడ వైపునకు గోదావరి పంటు దాటే వాహనాలను ముక్తేశ్వరం నుంచి యానాం వైపుగా దారి మళ్లిస్తున్నట్లు ఆయన చెప్పారు. కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం రేవులో ప్రయాణికులను మాత్రమే దాటిస్తామని చెప్పారు. రేవు ట్రాఫిక్ నియంత్రణ ఉన్నందుకు వాహనదారులు, ప్రయాణికులు గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.





ద్రాక్షారామకు ప్రత్యేక శోభ

ద్రాక్షారామ, మార్చి 6: త్రిలింగ క్షేత్రం, పంచారామం, దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ద్రాక్షారామ భీమేశ్వరాలయం శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవానికి సిద్ధమయ్యింది. ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి వారు స్వయంభువునిగా కొలువుదీరారు.. మాణిక్యాంబ అమ్మవారు అష్టాదశ శక్తిపీఠాలలో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్నారు. శివరాత్రి పర్వదినాన సప్తగోదావరిలో పుణ్యస్నానమాచరించి భీమేశ్వరుని దర్శిస్తే సర్వపాపాలు హరిస్తాయని కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. భీమేశ్వరాలయంలో శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, ప్రాత:కాలార్చన, తీర్థపుబిందె, ప్రథమ అభిషేకం, బాలభోగం కార్యక్రమాలు జరుగుతాయి. 4.00 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భీమేశ్వరస్వామి వారికి భక్తులచే అభిషేకములు, ఏకాదశ రుద్రహోమం. పూజలు జరుగుతాయి. రాత్రి 8.30 గంటలకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ జరుగుతుంది. రాత్రి 10.30 గంటలకు స్వామివారి రాజభోగం నిమిత్తం 11 నుంచి రాత్రి 12 గంటల వరకు స్వామి దర్శనానికి విరామం. 12 గంటల నుంచి రాత్రి 1.30 వరకు స్వామి దర్శనానికి అనుమతిస్తారు. ఆలయానికి తరలి వచ్చే అశేషమైన భక్తులకు స్వామి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత, శీఘ్ర, విశిష్ట దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ అధికారి, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. భక్తులకు సేవలు అందించేందుకు పరిసర ఆలయాల సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. పైండా వారి అన్నసత్రంలో అన్నదానం జరిపేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

మహా పుణ్యక్షేత్రం

కుండలేశ్వరం

కాట్రేనికోన, మార్చి 6: కుండలేశ్వరం వచ్చి వృద్ధగౌతమిలో స్నానం చేసి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీ పండితులు అంటుంటే తాను ఎంతో ఆశ్చర్యపోయానని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానించారంటే కుండలేశ్వర మహత్యం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అందుకే చాగంటి తరచూ కుండలేశ్వరంలో పూజలు నిర్వహించడమే కాకుండా స్వయంగా ఆయన ఇక్కడ కొన్ని నిర్మాణాలను చేపట్టారు. అమలాపురానికి సమీపంలో వృద్ధగౌతమీ నదీ తీరాన వెలసిన కుండలేశ్వరం క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమ మహాముని ప్రతిష్ఠించడం విశేషం. బ్రహ్మాండ పురాణంలో వ్యాసమహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. ఇప్పటికీ అర్ధరాత్రి వేళ ఈ క్షేత్రం సమీపంలో నదీ గర్భంలో ఓంకార నాదాలు వినిపిస్తాయని అంటుంటారు. ఈ ఆలయాన్ని అర్చకులే అభివృద్ధి చేయడం మరో విశేషం. కాళ్ళకూరి కుటుంబం ఆలయ అభివృద్ధికి పాటుపడుతోంది. మహాశివరాత్రి రోజున ఎందరో భక్తులు కుండలేశ్వరం వచ్చి స్వామిని దర్శించుకుంటారు. అయితే ఇక్కడ నదీతీరం ప్రమాదకరంగా ఉంది. భక్తుల కోసం ఇక్కడ శాశ్వత స్నానఘట్టాలు నిర్మించాల్సిన అవసరం ఉంది.



ఘనంగా కుక్కుటేశ్వరుని కల్యాణం



కుక్కుటేశ్వర స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దొరబాబు, ఎంపీ గీత



పిఠాపురం, మార్చి 6: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకారం చేసి ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. వేద పండితులు చెరుకుపల్లి వెంకటేశ్వర్లు, ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పట్టువస్త్రాలు, మంగళసూత్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణోత్సవంలో ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబుతో పాటు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు కల్యాణానికి ముందు వాసవి మహిళా భక్త బృందం సభ్యులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

మండపేట, మార్చి 6: మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో విఘ్నేశ్వర మోడ్రన్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి రూ.35,15,687 విలువైన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు వివరాలు వెల్లడించారు. సివిల్ సప్లయి అధికారులతో కలిసి తాపేశ్వరంలో ఉన్న రైస్ మిల్లును తనిఖీ చేస్తుండగా వెలగతోడు గ్రామానికి చెందిన ఏరుబడి సురేష్ ద్విచక్ర వాహనంపై 120 కిలోల రేషన్ బియ్యం విక్రయించేందుకు తీసుకువచ్చాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా వెలగతోడులో రేషన్‌కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కిలో రూ.16 వంతున కొనుగోలు చేసి మిల్లు వద్ద రూ.20కి విక్రయిస్తున్నట్లు చెప్పాడు. తాపేశ్వరంలో రైస్‌మిల్లు నిర్వాహకుడు అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కర్రి దత్తాత్రేయ గురుకృష్ణారెడ్డి తానే రేషన్ బియ్యంను కొనుగోలు చేసినట్టు అంగీకరించారని అధికారులు తెలిపారు. మిల్లులో రికార్డులను పరిశీలించగా లభ్యం అయిన 267.87 క్వింటాళ్ల బియ్యం, సుమారు రూ.35,15,687 వరకు బియ్యం విలువ ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో లభ్యమైన వాహనాలను సీజ్ చేసి 6ఎ కింద కేసు నమోదు చేసి బియ్యం విక్రయించే వ్యక్తితో పాటు, మిల్లు యజమానిపై కేసులు నమోదు చేశామని అధికారులు తెలిపారు. దాడుల్లో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి, మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు నిల్వలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. బియ్యం కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు. నాగవెంకటరాజు, విజయ్‌కుమార్, జగన్నాథరెడ్డి, సీఎస్‌డీటీ అలీషా పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, మార్చి 6: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన నార్కెడుమిల్లి రామకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు వేదాశీర్వచనం అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మన్యం సూర్యకుమారి భాను, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,00,144 లభించింది.

నేడు ప్రసాద్ స్కీం పనులకు మోదీ శంకుస్థాపన

అన్నవరం, మార్చి 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులను గురువారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ స్కీం ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయి. 8 ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న నిధులను ఎట్టకేలకు రూ.90 కోట్ల నుంచి ముందుగా రూ.50 కోట్లకు కుదించి చివరగా రూ.20 కోట్లతో సరిపెట్టారు. ఈ నిధులను టీటీడీ సత్రం ప్రదేశంలో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వద్ద మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులకు ఖర్చు చేయనున్నారు. గురువారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమాలను వార్షిక కల్యాణవేదిక ప్రాంగణంలో చేపట్టనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. 11.30కి ఎమ్మెల్యే, ఎంపీల ప్రసంగం అనంతరం 11.45కు ప్రధాని మోదీ ప్రసంగం వర్చువల్‌గా ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మార్చి6: తుని రైల్వేస్టేషన్ పరిధిలో హంసవరం, అన్నవరం రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.82 కోట్లు

అన్నవరం, మార్చి 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,82,53,964 నగదు, 19 గ్రాముల బంగారం, 1580 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యుఎస్‌ఏ 137 డాలర్లు, సింగపూర్ 39, సెంట్రల్‌బ్యాంక్ ఒమెన్ 800 లభించాయి. లెక్కింపును ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 34 రోజులకు ఈఆదాయం సమకూరగా స్వామివారికి సరాసరిన రోజుకు రూ.5.07 లక్షలు హుండీలలో కానుకలను భక్తులు సమర్పించారు.

అంగరంగ వైభవంగా భీమేశ్వరుని కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

- శోభాయమానంగా సామర్లకోట ఆలయ ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

సామర్లకోట, మార్చి 6: కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపురసుందరి అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం బుధవారం రాత్రి వేలాదిమంది భక్తుల నడుమ, వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవాన్ని ఆలయ పండితులు శ్రీపాద రాజశేఖర్ ఘనాపాఠి, వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే స్థానిక చంద్రశేఖరస్వామి ఆలయం నుంచి పండితులు పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణ ప్రక్రియ కథా వృత్తాంతాన్ని తణుకుకు చెందిన పండితులు శర్మ సమగ్రంగా వివరించారు. కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను గంజి బూరిబాబు కుటుంబ సభ్యులు అందజేశారు. ఆ కల్యాణోత్సవంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, దవులూరి సుబ్బారావు, బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్, విద్యుల్లత దంపతులు, కటకం సతీష్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణ పూజల అనంతరం హాజరైన భక్తులకు ప్రసాదాలు, కల్యాణ ముత్యాల తలంబ్రాలు, రుమాళ్లను భక్త సంఘం పంపిణీ చేసింది. ఈ కల్యాణోత్సవంలో అమలకంటి శ్రీనివాసరావు, కంచర్ల నాగజగన్నాథ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రెండో స్థానంలో కాకినాడ టౌన్ బ్యాంకు

ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర

కాకినాడ సిటీ, మార్చి 6 : తమ బ్యాంకు మొత్తం టర్నోవర్ రూ.1740 కోట్లుగా ఉందని, రాష్ట్రంలో ఉన్న అర్బన్ బ్యాంకుల్లో కాకినాడ టౌన్ బ్యాంకు 2వ స్థానంలో నిలిచిందని ది కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడించారు. కాకినాడ గాంధీనగర్ యూనివర్సల్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం కాకినాడ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర బ్యాంకు ఆర్థిక లావాదేవీల వివరాలు తెలియజేశారు. రిజర్వ్ బ్యాంకు వారి కేటగిరైజేషన్ ప్రకారం టైర్-3 బ్యాంకుగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఖాతాదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇటీవలే ఫోన్-పే, గూగుల్-పే సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. గత నెల ఫిబ్రవరి 29 నాటికి బ్యాంకు నెట్ ఎన్‌పీఏవో-91గా, సీఆర్‌ఏఆర్ 18.27 శాతంగా ఉందన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ తోట సుధీర్, డైరెక్టర్లు గారపాటి అచ్యుత కల్యాణ్‌ప్రసాద్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, అయ్యగారి వెంకటేష్, బ్యాంకు సభ్యులు పి.కృష్ణ, ఎన్ జనార్ధనరెడ్డి, బ్యాంకు సీఈవో సి.సుగుణరావు, అసిస్టెంట్ ఎల్‌టీవో బి సుహాస్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర తదితరులు

ఎన్నికల వేళ విలేకర్లకు తాయిలాలు

గిఫ్ట్ బాక్సులు పంపిణీ చేసిన ఎంపీ భరత్





రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ వైసీపీ నాయకుల ప్రలోభాల పర్వం నిస్సిగ్గుగా నడుస్తోంది. తూర్పు గోదావరి జిల్లా రాజ మహేంద్రవరం రూరల్ వైసీపీ ఇన్‌చార్జి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న సమాచార శాఖ వాహనంలో గిఫ్టులను తరలించి ఏకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వాటిని వలంటీర్లు, ప్రభుత్వ, సచివాలయ సిబ్బందిని ప్రసన్నం చేసుకోవడానికి వినియోగించారు. నేనేం తక్కువ తిన్నానా అంటూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎంపీ భరత్ రామ్ విలేకరులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో కొంత మంది రిపోర్టర్లకు చీర, ప్యాంటు షర్టు బిట్లు ఉన్న సంచిని అందజేశారు. ఒక్కో ప్యాక్ విలువ సుమారు రూ.3 వేలు ఉంటుంది. అప్పుడు కొంత మందికి అందకపోవడంతో వారికి బుధవారం ఇచ్చారు. ఈ గిఫ్టులను వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి పంపించారని చెబుతున్నారు. నెల కిందట జిల్లా వైసీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కూడా రిపోర్టర్లకు కాస్త పెద్ద మొత్తం విలువ చేసే గిఫ్టులను చేతికిచ్చారు. కొందరికి ఇళ్లకు తీసుకెళ్లి మరీ అందజేశారు. అవి కూడా వైసీపీ సెంట్రల్ ఆఫీసు నుంచి వచ్చాయని సమాచారం. ఆ గిఫ్టుప్యాక్‌లో ఇయర్ ఫోన్లు, పవర్‌బ్యాంకు, ట్రైపాడ్, వాచీ.. ఇలా సుమారు రూ.8-10 వేలు విలువ చేసే వస్తువులు ఉన్నాయి. సుమారు 30 మందికి వీటిని పంచారు. వైసీపీ నుంచి సీటు ఆశిస్తున్న నాయకులు వలంటీర్లు, మీడియా, సచివాలయ సిబ్బంది, అంగ న్వాడీలు, ఆశా వర్కర్లకు ఎక్కడికక్కడ గిఫ్టులు ముట్టజెబుతున్నారు. తమకు అనుకూలంగా పని చేయాలని మౌఖికంగా హుకుం జారీ చేస్తున్నారు. అంతా బహిరంగంగా చేస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేయడం గమనార్హం.

మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు

పిఠాపురం, మార్చి 6: మహిళ హత్య కేసులో అల్లుడికి జీవితఖైదు విధిస్తూ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తీర్పు చెప్పారు. భార్యను చంపిన కేసులోనూ అతను ముద్దాయిగా ఉన్నాడు. పిఠాపురం పట్టణంలోని లయన్స్ కల్యాణమండపం ఏరియాలో నివాసముండే కేతినీడి ఉమాదేవి(71) తన కుమార్తె ఆళ్ల హేమమాలిని, అల్లుడు ఆళ్ల నారాయుడితో కలిసి జీవించేది. 2017 మార్చి 17వ తేదీన ఉమాదేవి అనుమానాస్పద స్థితిలో మరణించింది. అయితే ఉమాదేవితో కుమార్తె, అల్లుడు ఆస్తి విషయంలో గొడవపడినట్లు, దీంతో ఆమె మృతిపై తమకు అనుమానం ఉందని ఉమాదేవి సోదరుడు అడబాల ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్‌ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సీఐ బోను అప్పారావు దర్యాప్తు చేసి కుమార్తె, అల్లుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణలో ఉండగానే ఆళ్ల హేమమాలిని 2022లో హత్యకు గురయింది. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో ప్రధాన నిందితుడైన నారాయుడికి 302 సెక్షన్ కింద జీవిత ఖైదు, వేయి రూపాయల జరిమానా, 201 సెక్షన్ కింద 5 సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయిలు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా జీవితఖైదు పడిన నారాయుడు తన భార్యను హత్య చేసిన కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు చేసిన అధికారులతో పాటు స్పీడ్ ట్రైల్ అయ్యేలా చూసిన పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్, ఏఎస్‌ఐ వి.దుర్గారావు, పీపీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

టెంట్‌హౌస్ దగ్ధం: రూ.15 లక్షల నష్టం

ఆత్రేయపురం, మార్చి 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించి టెంట్‌హౌస్ దగ్ధమైంది. చిట్టూరి ఊదరాజు సొసైటీ గోదాము సమీపంలోని తాటాకు పాకలో సప్లయి కంపెనీ నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంలో ఆటో, మూడు జనరేటర్లు, ఒక మోటారు సైకిల్, విలువైన సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 కిలోల గంజాయి పట్టివేత

సీతానగరం, మార్చి 6: గంజాయితో తమిళనాడుకు చెందిన వ్యక్తిని బుధవారం సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. సీతానగరం ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు పురుషోత్తపట్నం లాంచి రేవు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని విచారించగా అతని వద్ద గల బ్యాగ్‌లో 8 కిలోల గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సరుకును స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని విచారించగా తమిళనాడు లోని దిండిగల్‌కు చెందినవాడిగా గుర్తించారు. సరుకు విలువ రూ.30 వేల వరకు ఉండవచ్చునని తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత

శంఖవరం, మార్చి 6: యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఫిబ్రవరిలో ఈ పరీక్షలు పాఠశాల, మండలస్థాయిలో జరిగాయి. మండల స్థాయిలో ఎన్.వెంకటేష్ ప్రథమ బహుమతి, ఎన్.గనిలక్ష్మి ద్వితీయం, జి.జశ్వంత్ తృతీయ బహుమతి సాధించడంతో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తోట సీతారామయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగాసూరిబాబు అందజేశారు.

'టీడీపీ విజయానికి సహకరించాలి'

సామర్లకోట, మార్చి 6: రానున్న ఎన్నికల్లో పెద్దాపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్నందున గతంలో వలె తనను ఆశీర్వదించడం టీడీపీ విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను అభ్యర్థించారు. బుధవారం మండలంలోని వేట్లపాలెంలో రైస్ మిల్లర్లు, సగ్గుబియ్యం మిల్లర్లు, ఎక్స్‌పోర్టర్స్, ల్యాండ్‌లార్డ్‌లు, రైతు ప్రతినిధులు, జొన్నాడ బ్రదర్స్ కుటుంబసభ్యులు, కొండపల్లి జగ్గారావు, కొండపల్లి వెంకన్నబాబు, గోలి ధర్మరాజు, చలికి వీర్రాజు, డాక్టర్ జనార్దనరావును ఎమ్మెల్యే కలిసి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజప్ప తనయుడు రంగనాగ్, రాజా సూరిబాబురాజు, గుమ్మళ్ళ రామకృష్ణ, కొండపల్లి కృష్ణమూర్తి, నున్న రామకృష్ణ, గుమ్మళ్ళ రాజు, గుమ్మళ్ళ సత్యనారాయణ, గోలి వీరభద్రరావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

'సమన్వయంతో ముందుకు సాగాలి'

తుని రూరల్, మార్చి 6: టీడీపీ, జనసేన కార్యకర్తలతోపాటుగా పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్న ఇతర పార్టీ సభ్యులను ఒక్కటిగా చేసుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంటలోని యనమల నివాసంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. తుని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య విజయానికి ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో గెలిపించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మోతుకూరి వెంకటేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, పోలిశెట్టి ధారబాబు, మార్కండేయులు, కొంద్రెపు నాగేశ్వరరావు, బొప్పన రాము, జనసేన, టీడీపీ కార్యకర్తలున్నారు.

'పిఠాపురాన్ని చంద్రబాబుకు బహుమతిగా ఇద్దాం'

పిఠాపురం, మార్చి 6: నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న తనను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని, పిఠాపురం నియోజకవర్గాన్ని చంద్రబాబుకు బహుమతిగా ఇద్దామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం పాత టీడీపీ కార్యాలయ ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన నియోజకవర్గస్థాయి కాపుల ఆత్మీయ సమ్మేళనానికి భారీగా కాపులు తరలివచ్చారు. వర్మ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ 3 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశానని అన్ని సార్లు తనకు కాపులు అండగా నిలిచారని తెలిపారు. పలువురు కాపు నాయకులు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన వర్మకు రానున్న ఎన్నికల్లో అండగా ఉంటామని ప్రకటించారు.

పైప్‌లైన్లను తొలగించాలని ఆందోళన

కోనపాపపేట (కొత్తపల్లి), మార్చి 6: తీరప్రాంతంలో నెలకొల్పిన రసాయనపరిశ్రమల నిర్వాహణ కోసం సముద్రంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను వెంటనే తొలగించాలని కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన మత్స్యకారులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గతంలో తీరప్రాంత మత్స్యకారులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా అధికారులు హామీ ఇచ్చినా నెరవేరక పోవడంతో తాము నిరసన వ్యక్తం చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇప్పటి వరకు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులెవరూ తమ సమస్యలను పట్టించుకోలేదని, తమ సమస్యల్లో పాలు పంచుకునే రాజకీయ నాయకులకు తమ పూర్తి మద్దతుంటుందని ఈ సందర్భంగా మత్స్యకార ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

'మహారాజా ఆశయ సాధనకు కృషి'

పిఠాపురం, మార్చి 6: మహారాజా ఆశయసాధనకు సమాజంలో ప్రతీ ఒక్కరు అంకితభావంతో కృషి చేద్దామని జనసేన పిఠాపురం నియోజకవర్గ నేత డాక్టర్ పిల్లా శ్రీధర్ పిలుపునిచ్చారు. పిఠాపురం మహారాజా రాజా వెంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో గల మహారాజా విగ్రహానికి శ్రీధర్, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు గరగ సత్యానందరావు, పీఎస్ఎన్ మూర్తి, టైల్స్ బాబీ, చోడిశెట్టి శేషగిరి, గంటా బాబీ, శ్రీనివాసరావు, వినుకొండ అమ్మాజీ పాల్గొన్నారు. సంస్థాన సత్రంలో ఎంపీ వంగా గీత మహారాజా విగ్రహానికి నివాళులర్పించారు.

'ఇళ్ల పట్టాలిస్తామని చెప్పి మోసం చేశారు'

సర్పవరం జంక్షన్, మార్చి 6: సుమారు 3 దశాబ్దాల కిందట నుంచి పూరిళ్లు వేసుకుని నివసిస్తున్న తమకు పొజిషన్ పట్టా ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి ఖాళీ చేయించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా తమను మోసం చేశారని మత్స్యకార మహిళలు ఆరోపించారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఆంజనేయస్వామి వెనకాల స్థలం వద్ద గ్రామానికి చెందిన 18 మంది మహిళలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సూరాడ పుష్పవతి, గరికిన సత్యవతి మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్ విచారణకు ఆదేశించి తమకు న్యాయం చేయాలని కోరారు.

'బత్తుల మురళీకృష్ణ సేవలు చిరస్మరణీయం'

గొల్లప్రోలు, మార్చి 6: గ్రామాభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు విజయ ఎంటర్‌ప్రైజెస్ అధినేత బత్తుల మురళీకృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని మురళీకృష్ణ ఫంక్షన్‌హాలులో బుధవారం బత్తుల మురళీకృష్ణ 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1500మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు బత్తుల వీరభద్రం, శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, బండారు బాబూరావు, సైల శ్రీనివాస్ ఉన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి'

తాళ్లరేవు, మార్చి 6: మాట మార్చను మడం తిప్పను అంటూ ఎన్నోసార్లు ప్రజలను మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు దంగేటి అవినాష్ అన్నారు. బుధవారం పటవల గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యగ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ బాండ్లను ప్రజలకు అందజేసి వివరించారు. పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల ప్రారంభం

ఏలేశ్వరం, మార్చి 6: మండలంలోని తిరుమాలి గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయాన్ని బధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీ పూర్ణ చంద్రప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూతి ప్రసాద్, ఎంపీటీసీ పసల సూరిబాబు, కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: గజ్జెనపూడిలో సచివాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే శ్రీ పూర్ణ చంద్రప్రసాద్ ప్రారంభించారు. ఎంపీటీసీ ఎం.వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ ప్రారంభం

పిఠాపురం, మార్చి 6: పట్టణంలో రూ.1.10కోట్లు వ్యయంతో నిర్మించిన అంబేడ్కర్ భవన్‌ను కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ప్రారంభించగా, సీఎస్ఆర్ నిధులు నిర్మించే బీసీ, ఓసీ భవన్‌లకు శంకుస్థాపన చేశారు. 9వ వార్డు మాధవనగర్‌లో పార్కును ప్రారంభించగా, బాక్సు కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వాసుపత్రిలో గర్భిణుల సామూహిక సీమంతాల్లో ఎంపీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త హరినాథరావు మృతి

సామర్లకోట, మార్చి 6: అంబటి ఆయిల్స్ పరిశ్రమ భాగస్వామి సింగవరపు హరినాథరావు(71) బుధవారం సామర్లకోటలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో హైద్రాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రూ.9.59లక్షల కరెంట్ బిల్లు!

కరప, మార్చి 6: ఎప్పుడూ ఐదొందలు దాటని ఇంటి కరెంట్ బిల్లు ఒక్కసారిగా లక్షల్లో రావడం చూసి ఆ కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. పేపకాయలపాలెనికి చెందిన గొల్లపల్లి వీర్రాజు కరప పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నారు. ప్రతీ నెల అతడి ఇంటికి రూ.300 నుంచి రూ.500 వరకు కరెంట్ బిల్లు వచ్చేది. కానీ ఫిబ్రవరిలో ఏకంగా రూ.9,59,846ల కరెంట్ బిల్లు వచ్చింది. దీంతో కంగుతున్న వీర్రాజు బిల్లు రసీదును పట్టుకుని విద్యుత్‌శాఖాధికారులను ఆశ్రయించాడు. అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక కారణం వల్ల ఏర్పడిన ఈ తప్పిదాన్ని సవరిస్తామని వారు హామీ ఇచ్చి మీటర్‌ను టెస్టింగ్‌కు పంపించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారీ 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారీ 111, కిక్, ఊరు పేరు భైరవకోన

తిరుమల	అంబాజీపేట మ్యారేజిబ్యాండు
లక్ష్మి	ఆపరేషన్ వాలెంటైన్
సీ అండ్‌సీ1	హనుమాన్
సీ అండ్‌సీ2	ఆపరేషన్ వాలెంటైన్
శ్రీప్రియ	సుందరంమాస్టర్
పద్మప్రియ	ఆపరేషన్ వాలెంటైన్
సత్యగౌరి	భూతద్దం భాస్కర్
సూర్య 1	ఆపరేషన్ వాలెంటైన్
సూర్య 2	కిక్

జనసేన 'మేము సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 6: 36వ డివిజన్ గంజాంవారి వీధి ప్రాంతంలో బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ నాయకత్వంలో సిటీ సహాయ కార్యదర్శి మిరియాల హైమావతి ఆధ్వర్యంలో కార్యక్రమంలో జరిగింది. జగన్ అధికారంలోకి వచ్చాక 8సార్లు విద్యుత్ బిల్లులు పెంచారని ఎద్దేవా చేశారు. తలాటం సత్య, బడే కృష్ణ, అడబాల సత్యనారాయణ, మిరియాల వీరనారాయణరావు, సాధనాల గంగాధర్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో

పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు

పెద్దాపురం, మార్చి 6: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని ఆర్డీవో సీతారామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలకు సంబంధించి కొత్త అకౌంట్‌ను ఓపెన్ చేయాలన్నారు. అలాగే నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు సంబంధించి అనుమతులను సువిధ యాప్ ద్వారా చేసుకోవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటువేసే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కార్యాలయం ఏవో సుబ్రహ్మణ్యం, రాజకీయ పార్టీల ప్రతినిధులు దారపురెడ్డి క్రాంతికుమార్, గవరసాన సూరిబాబు, రంధి సత్యనారాయణ తదితరులున్నారు.

'ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం'

కాకినాడ సిటీ, మార్చి 6: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ అన్నారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి అచ్చంపేట సెంటర్‌వద్ద గల ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కాకినాడ జేఎన్‌టీయూలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు.

'ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగం'

ప్రత్తిపాడు, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో 85 ఏళ్ల వృద్ధులకు, 40శాతం దాటిన దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకున్నట్టు నియోజకవర్గ ఈఆర్వో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రత్తిపాడు తహశీల్దార్ ఎస్.నరసింహారావు ఉన్నారు.

చెట్లను నరికించే సీఎంను చూశారా?



మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

జనసేన, టీడీపీ వినూత్న నిరసన

కరప, మార్చి 6: తన పర్యటనల పేరుతో దశాబ్దాల చరిత్ర కలిగిన చెట్లను నరికించే సీఎంను మీరెక్కడైనా చూశారా అంటూ జనసేన, టీడీపీ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కరప మండలం పెనుగుదురు ప్రధానర హదారిపై మంగళవారం సాయంత్రం ఇరు పార్టీల నాయకులు చెట్ల నరికివేతకు సంబంధించిన ఫొటోలు, ఫ్లకార్డులు చేతబట్టి నిరసనకు దిగారు. సీఎం జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చే ప్రతీసారి విలువైన చెట్లను నేలకూల్చుతూ ప్రకృతి వినాశనానికి పాల్పడుతున్నారని విమర్శించారు. పరదాల మాటున పర్యటనలు చేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర విఘాతం కలిగిస్తూ ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం వాహనదారులకు మొక్కలు పంపిణీ చేసి ప్రకృతిని సంరక్షిస్తాం అంటూ ప్రతినబూనారు. ఇదే సమయంలో కారులో అటుగా వెళ్తున్న వైసీపీ నాయకుడు డాక్టర్ పితాని అన్నవరం జనసైనికులు ఇచ్చిన మొక్కలను నవ్వుతూ తీసుకుని వారితో మాట కలపడం, పరిశీలిస్తాం అంటూ చెప్పడం గమనార్హం. జనసేన నేత రెడ్డిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పంతం సందీప్, గంటా నానిబాబు, పబ్బినీడి హరిబాబు, పులపకూర మహేష్, సుకుమార్, బాబి, కొండ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కృషి చేయాలి

కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి నానాజీ



సర్పవరం జంక్షన్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ఉమ్మడిగా సమన్వయం చేసుకుంటూ కృషి చేయాలని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కోరారు. వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం వైసీపీ నేత మెండు సందీప్ ఆధ్వర్యంలో గంటా ప్రసాద్, గేదెల చిన్నారావు, ఎస్.శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్‌లతో సుమారు 30 మంది యువకులు, మహిళలు జనసేన పార్టీలో చేరారు. వారికి నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

కరప: కరప మాజీ వైస్ ఎంపీపీ, నడకుదురు మాజీ సర్పంచ్ యాసలపు దుర్గాప్రసాద్ జనసేనలో చేరారు. నడకుదురు వెలంపేటలో దుర్గాప్రసాద్ స్వగృహంలో ఆయనతో బాటు అతని అనుచరులు 40మంది పార్టీలో చేరారు. కాకినాడరూరల్ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి, పీఏసీ సభ్యుడు పంతం నానాజీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, మండలాధ్యక్షుడు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, రెడ్డిపల్లి భాస్కర్, ముత్యాలరావు పాల్గొన్నారు. నడకుదురులో జనసేన కార్యాలయాన్ని పంతం నానాజీ ప్రారంభించారు. టీడీపీ, జనసేన నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, బండారు మురళి, తుమ్మలపల్లి మాచరరావు, యాసలపు దుర్గాప్రసాద్, చీపురపల్లి జయేంద్రబాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



శంఖవరం: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

శంఖవరం, మార్చి 6: శంఖవరంలో వైసీపీని వీడి భారీస్థాయిలో నేతలు స్థానిక నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. నక్కా వెంకట అప్పారావు, కటారి నాగసత్యనారాయణ, చనిబోయిన తమ్మయ్య, ములికి పాములు, కటారీ సత్యనారాయణ దళిత నేతలు బందిలి పాపారావు, దుర్గాప్రసాద్, మహేష్ యాదవనేత కొల్లుబోయిన దేవి భగవాన్ తదితర నేతలను ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ముదునూరి మురళీకృష్ణంరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు బద్దిరామారావు, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్, ఉల్లి వీరభద్రరావు, ఈగల దేవుళ్ళు, జనసేన నేత మేకల కృష్ణ, బుర్రా వాసు, రౌతు శ్రీను, సాదనాల లక్ష్మీబాబు, కేశంగి జనార్ధన్ పాల్గొన్నారు.

కోటనందూరు: కోటనందూరు, కాకరాపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. చేరినవారిలో వెంకట గంగాదర రంగనాయకులు, వెలగా వెంకట కృష్ణారావు, పల్లా రామకృష్ణ, కోన వీరబాబు, షేక్ మీరా తదితరు 200మంది ఉన్నారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య, యనమల కృష్ణుడు, చోడిశెట్టి గణేష్, గాడి రాజుబాబు, మోతుకూరి వెంకటేష్, డి.చిరంజీవిరాజు, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

కరప, మార్చి 6: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం దాతల సహకారంతో పరీక్షా సామగ్రి లభించింది. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, టీడీపీ నేత యర్రమాటి సతీష్ విజ్ఞప్తి మేరకు కాకినాడ ఆచార్య జూనియర్ కళాశాల యాజమాన్యం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్‌లను సమకూర్చింది. స్థానిక సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్ పాఠశాలలోని 244మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం బి.స్వర్ణరాణి, ఉపాధ్యాయులు టేకుమూడి శ్రీనివాస్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ కూనపురెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక ఎస్‌కేకేఎం కళాశాల ఆధ్వర్యంలో పెద్దాపురం, రంగంపేట, గండేపల్లి, మండలాల్లో ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్.చక్రం, ఏసుబాబు, మధుసూదన్‌రావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల వ్యవస్థాపకుడు పోసిన సూరిబాబు ప్రథమ వర్ధంతి సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు పెన్నులు, పౌచ్‌లు అందజేశారు. హెచ్ఎం సూర్యప్రకాష్‌రెడ్డి అధ్యక్షత వహించగా విశ్రాంత ఎంఈవో, హెచ్ఎంలు దుర్గాప్రసాద్, పీవీ రమణమ్మలు, విద్యుత్‌శాఖ విశ్రాంత డీఈ ప్రసాద్, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, దాడి పద్మనాభం, మలిరెడ్డి నారాయణరావు, చల్లా ఉమారాజ మంగతాయారు, కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపురాజు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దమల్లాపురంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు.

శానిటేషన్ వర్కర్ల ఆందోళన

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 6: పీఎఫ్, ఈఎస్ఐ వాటా సొమ్ము కార్మికుల జీతాల నుంచి కోతకోయడానికి వ్యతిరేకంగా కాకినాడ జీజీహెచ్‌లో శానిటేషన్ వర్కర్లు నిర్వహిస్తున్న ఆందోళన బుధవారానికి 32రోజులకు చేరింది. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి పాల్గొన్నారు. సమ్మె నోటీసును రెండోసారి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌కు అందించారు.

పోస్టల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 6: కేబుల్ టీవీ ఆపరేటర్లకు అన్ని ప్రధాన పోస్టాఫీస్‌ల్లో 5 రోజులపాటు పోస్టల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ మేళా నిర్వహిస్తున్నారని కేబుల్ కుటుంబసభ్యులు కాకినాడ ఏపీఎస్ఎఫ్ఎల్ ఎమ్మెస్వో బండారు కృష్ణమూర్తి తెలిపారు. ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె.సుధీర్ బిపిఓను బుధవారం ఆయన కలిసి పోస్టల్ రిజిస్ట్రేషన్ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా వివరించారు. రెన్యువల్ విషయంలో కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక అవకాశం కల్పించాలని ఆయన కోరారు. దీనికి స్పందించిన పోస్టల్ అధికారి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన పోస్టాఫీస్‌లకు పోస్టల్ రిజిస్ట్రేషన్ రెన్యువల్ విషయమై మార్గదర్శకాలను జారీ చేశారు.

'నాయకర్ ఆశయ సాధనకు కృషి'

సర్పవరం జంక్షన్, మార్చి 6: విద్యాప్రదాత ఎంఎస్ఎల్ నాయకర్ ఆశయ సాధన కోసం, మహిళలు ఉన్నత విద్యాభ్యాసం కోసం అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు అక్కా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు తెలిపారు. బుధవారం తిమ్మాపురం అక్కా ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో ఉమెన్స్ కోసం నూతనంగా నిర్మించనున్న హాస్టల్ భవనం, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు రిజిస్ట్రార్ జి.సుధాకర్‌తో కలసి భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆహ్లాద వాతావరణంలో దాత నాయకర్ స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యసాధన కోసం కష్టపడి విద్యనభ్యసించాలని కోరారు. ప్రస్తుతమున్న మహిళా వసతి గృహంలో మరింత మంది మహిళలు ఉన్నత చదువులు అభ్యసించాలనే ఉద్దేశంతో ఆధునిక హంగులతో 200మందికి వసతి అందించేలా నిర్మాణం ఉంటుందన్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ డాక్టర్ కె. నూకరత్నం, ఎం.వసంతలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ దీప్తి, కాంట్రాక్టర్ సుబ్రహ్మణ్యం, పలువురు అధ్యాపకులు ఉన్నారు.

'సంపూర్ణ అవగాహన అవసరం'

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 6: ఎన్నికల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలకు సంపూర్ణ అవగాహన ఎంతో అవసరమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ప్రక్రియపై ఈఆర్వో సమావేశమై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రతినిధులకు వివరించారు. 80ఏళ్ల దాటిన వృద్ధులు, పోలింగ్ బూత్‌కు రాని వారిని, 40శాతం వైకల్యంతో బాధపడేవారిని గుర్తించి బీఎల్వోల ద్వారా నివేదిక సిద్ధం చేశామన్నారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. సమావేశంలో బెజవాడ బాబి(వైసీపీ), గట్టి సత్యనారాయణ(బీజేపీ, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్(టీడీపీ), ఏఈ ఆర్వోలు సీతాపతిరావు, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జేఎన్టీయూకే, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జేఎన్టీయూకే రెక్టార్ కేవీ.రమణ ముఖ్యఅతిథిగా, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఐఎస్టీ డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, టెక్నాలజీస్ ప్రత్యేకాధికారి జీవీఎస్ఆర్ దీక్షితులు వైద్యశిబిరాన్ని ప్రారంభించగా ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ డైరెక్టర్ ఎం.స్వరూపారాణి అధ్యక్షత వహించారు. ట్రినిటీ, ఆల్ట్రా కంటి ఆస్పత్రులకు చెందిన ఆర్థోపెడిక్, గైనిక్, ఆంకాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తాల్మిక్ విభాగాల వైద్యులు బీపీ, షుగర్, బోన్ మినరల్ డెన్సిటీ, ఈసీజీ, పాప్‌స్మియర్ వంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. సెనేట్ హాల్లో క్యాన్సర్‌పై డాక్టర్ కౌశిక్ హరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, ప్రత్యేకాధికారులు, విభాగాధిపతులు ఉన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా చంద్రమౌళి




చంద్రమౌళి

కాకినాడ సిటీ, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కాకినాడకు చెందిన టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చంద్రమౌళి సీటు ఆశించారు. సిట్టింగ్‌లకే అవకాశం ఇవ్వడంతో ఆయనకు సీటు దక్కలేదు. దీంతో ఆయనకు పార్టీలో కీలక పదవి అప్పగించారు. ఈ నాలుగున్నరేళ్లలో ఆయన పార్టీ తరఫున అనేక పోరాటాలు చేసి పార్టీ కార్యక్రమాలకు అండగా ఉన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నేత పేరాబత్తుల రాజశేఖర్‌ను కూడా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు సన్నిహితులైన వీరికి ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించడంపట్ల చంద్రమౌళి, రాజశేఖర్ పార్టీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీపీ సుధారాణికి ప్రతిభా పురస్కారం

కాకినాడ క్రైం, మార్చి 6: కాకినాడ మూడో అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ కె.సుధారాణికి ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డు లభించింది. గుంటూరులో 2రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర ప్రాసిక్యూటర్స్ రాష్ట్రస్థాయి సదస్సులో సుధారాణికి ఉత్తమ ప్రతిభా పురస్కారం అవార్డును అడ్వకేట్ జనరల్ శ్రీరామ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డి అందించారు. అవార్డు అందుకున్న ఏపీపీ సుధారాణికి కాకినాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.విశ్వేశ్వరరావు, బార్ సభ్యులు అభినందనలు తెలిపారు.

లేపాక్షిలో యాన్యువల్ క్లియరెన్స్ సేల్స్



కాకినాడ సిటీ, మార్చి 6: నాగ మల్లితోట జంక్షన్ వద్ద గల లేపాక్షి షోరూమ్‌లో యాన్యువల్ క్లియరెన్స్ సేల్స్ ఈనెల 31 వరకు కొనసాగించనున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు షోరూమ్ తెరిచి ఉంచనున్నారు. ఎంపిక చేసిన హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నారు. హస్తకళా వస్తువులైన కొండపల్లి బొమ్మలు, బంజారా-క్రోచెట్ లేస్, ఏటికొప్పాక బొమ్మలు, షరాన్‌పూర్ ఉడ్ కార్వింగ్, రోజ్ ఉడ్ కార్వింగ్ బ్రాస్ అండ్ కాపర్‌వేర్, చేనేత వస్త్రాలైన కలంకారి, శారీస్ అండ్ బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్, నారాయణపేట చీరలు, కాశ్మీరీ సిల్క్ అండ్ షాల్స్, నారాయణవనం షాల్స్, లభ్యమవుతున్నాయి. హస్తకళా వస్తువులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని షోరూమ్ మేనేజర్ సీ.వీరబాబు కోరారు.

ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



పసుపుపోటు వేస్తున్న మహిళలు

గొల్లప్రోలు రూరల్, మార్చి 6: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మహిళలు పసుపుపోటు వేశారు. అనంతరం కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరిగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృత స్నానం నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు కల్యాణ అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ప్రత్తిపాడు, మార్చి 6: ప్రత్తిపాడులో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడును చేసే క్రతువును వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. రాత్రి అన్నపూర్ణ దేవితో కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం

పెద్దాపురం, మార్చి 6: మండలంలోని కట్టమూరు గ్రామంలో రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకస్వాములు జరిపించారు. అనంతరం ప్రసాదాలను వితరణచేశారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కోదండరాముడికి పూజలు

రౌతులపూడి, మార్చి 6: మండలంలో ములగపూడిలో శ్రీరామగిరి కోదండరాముడికి ఏకాదశి పూజలు నిర్వహించారు. అకంరెడ్డి సత్యనారాయణ పుణ్యదంపదుల ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్లను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయగా అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అపర్ణామాల దీక్షాధారణ ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, మార్చి 6: తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అపర్ణామాల దీక్షాధారణ ప్రారంభమైంది. దీక్ష తీసుకున్న భక్తులకు ఉచితంగా దుస్తులు సమకూర్చడంతో పాటు బిక్ష ఏర్పాటు చేశారు. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ప్రధాన కార్యవర్గసభ్యుడు దాసం వెంకటేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పృథ్వీరాజుకు జాతీయ పురస్కారం

కాకినాడ సిటీ, మార్చి 6: న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూ మహిళా సాధికారిత కోసం చేసిన కృషికిగాను కాకినాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది టి.పృథ్వీరాజుకు జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల విశాఖలో జరిగిన 'షి ప్రైడ్' 2024 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో తొలి మహిళా ఐపీఎస్ అధికారిణి కిరణ్‌బేడీ నుంచి పృథ్వీరాజు పురస్కారాన్ని అందుకోగా పలువురు అభినందించారు.

జె.అన్నవరం పీహెచ్‌సీ పరిశీలన

ఏలేశ్వరం, మార్చి 6: మండలంలోని జె.అన్నవరంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీడీపీ నేతలు ఎంపీపి గొల్లపల్లి బుజ్జి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీ దేవి సందర్శించి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ శ్రీలక్ష్మిని శాలువాతో సత్కరించారు. సర్పంచ్ కళ్యాణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కు అందజేత

తుని రూరల్, మార్చి 6: తుని మున్సిపాలిటీలో డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.5.30కోట్లు ఆసరా పథక చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అందజేశారు. కార్యక్రమంలో ర్యాలంగి రమణా గౌడ్, అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పామర్తి మహేష్, పలువురు నాయకులు ఉన్నారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తుని రూరల్, మార్చి 6: జాతీయ రహదారి ఆనుకుని తేటగుంట సమీపంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ పోలీసులు పట్టుకున్నారు. 13 బీరు బాటిల్స్, 5 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఈబీఎస్‌హెచ్‌వో చిట్టిబాబు తెలిపారు.

